ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో


ప్రదర్శనలో ఉత్పత్తులనుపరిశీలిస్తున్న మహిళలు

బంజారాహిల్స్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా పడుతున్నాయి. మరో వైపు రాబోయేది పండుగల సీజన్ ఈ తరుణంగా సమ్‌థింగ్ స్పెషల్‌గా కనిపించాలని ఫ్యాషన్ ప్రియులు కోరుకుంటున్నారు. వీరికి వన్ స్టాప్ సొల్యూషన్‌గా అన్ని వస్తువులను ఒకే వేదిక మీదకు తెస్తూ శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటైన నేషనల్ సిల్క్‌ఎక్స్‌పో ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్‌బ్లాక్, ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్‌జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాళ్లలో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశం ఉచితం అని, ఈనెల 14 వరకు ఎక్స్‌పో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రూ.12 లక్షలు విలువచేసే వాచ్‌లు, నగదుతో షోరూం ఉద్యోగి పరారీ

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల విలువచేసే వాచ్‌లతోపాటు నగదుతో ఉడాయించిన షోరూం ఉద్యోగిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 36 కమల్ వాచ్‌షోరూంలో నవీన్‌వ్యాస్, చేతన్ బెటల కొద్ది కాలంగా పనిచేస్తున్నారు. జూన్ 28 నుంచి చేతన్ పనికి రావడం లేదు. అదేరోజు నవీన్‌కు ఫోన్ చేసి తాను జూన్ 22కు ముందు రెండు వాచ్‌లు ప్రస్తుతం మరో వాచ్‌చోరీ చేశానని వాటిని త్వరలోనే తిరిగి ఇచ్చేస్తానని చెప్పాడు. కానీ రోజులు గడుస్తున్నా చేతన్ వాచ్‌లను తిరిగి ఇవ్వకపోవడంతో నవీన్ విషయాన్ని యాజమాన్యానికి తెలియచేశాడు. పరిశీలించగా మూడు వాచ్‌ల విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని అంతే కాకుండా ఓ వినియోగదారుడి నుంచి షోరూంకు చెందిన రూ.2లక్షలను కూడా తీసుకున్నట్టు గుర్తించారు. షోరూం నిర్వాహకుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి ఆత్మహత్య

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో గృహిణి ఆత్మహత్య చేసుకుంది. అనంతపురానికి చెందిన మహబూబ్‌బాషా, షబానా దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. పిల్లలు హాస్టల్‌లో ఉండి చదువుకుంటుండగా భార్యాభర్తలు ఫిలింనగర్‌లోని స్వామి వివేకానందనగర్‌లో 4 సంవత్సరాలుగా ఉంటున్నారు. ఈనెల 9న మహబూబ్ పనిమీద బయటకు వెళ్లిసాయంత్రం తిరిగివచ్చాడు. తలుపు ఎంత కొట్టినా తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా షబానా ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని కనిపించింది. తలుపు బద్దలు కొట్టి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి: కాలేజీకి వెళ్లిన ఇంటర్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. టోలిచౌకికి చెందిన మహ్మద్ అబ్బాస్ సాఫ్ట్‌వేర్. ఆయనకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు మీరన్ ఇస్మాయిల్ హైదర్ అల్ ఫలాహ్ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 9న హైదర్ కాలేజీకి వెళ్లాడు. కొద్ది సేపటికి కాలేజీ ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్బాస్‌కు ఫోన్‌చేసి హైదర్ కాలేజీ సమీపంలో ఉన్న కిరాణాషాప్ వద్ద తప్పుడు పనిచేశాడని ఫిర్యాదు చేశాడు. వెంటనే వచ్చి తీసుకువెళ్లాలని సూచించాడు. దీంతో అబ్బాస్ కాలేజీకి వెళ్లాడు. అప్పటికే హైదర్ బాత్‌రూంకెళ్లి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ నేత గోవర్ధన్‌రెడ్డికి బెయిల్

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసం వద్ద హంగామా సృష్టించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ-2 మన్నె గోవర్ధన్‌రెడ్డి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. గత నెలలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ మారడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి మరికొంత మంది హంగామా సృష్టించారు. ఈ వ్యవహారంలో బంజారాహిల్స్ పోలీసులు అందరిపై కేసు నమోదు చేశారు. ఏ-2గా ఉన్న మన్నె గోవర్ధన్‌రెడ్డి అప్పటి నుంచి పరారీలో ఉండి మంగళవారం తమ అడ్వకేట్లతో కలిసి బంజారాహిల్స్ పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు నోటీసు ఇచ్చి పంపించేశారు.

పూజ చేస్తానని రూ.లక్షతో ఉడాయించిన మహిళ

బంజారాహిల్స్, జూలై 10(ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీపూజ చేస్తానని నమ్మించి, అమ్మవారి ముందు డబ్బు పెట్టి వేడుకుంటే అంతా మంచి జరుగుతుందని గృహిణిని బొల్తా కొట్టించి లక్ష రూపాయలతో ఓ మహిళ ఉడాయించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 41లో నివాసం ఉండే డాక్టర్ ఆర్‌ఎస్ సుబ్బారెడ్డి వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఈనెల 8న రాత్రి ఆయన ఇంట్లో లేని సమయంలో ఓ మహిళ ఒంటి నిండా నగలు వేసుకొని వచ్చింది. సుబ్బారెడ్డి భార్యతో మాటలు కలిసి వరలక్ష్మి పూజ చేస్తే అంతా మేలు జరుగుతుందని నమ్మించింది. మాటల్లో పెట్టి ఇంట్లోకి వచ్చి పూజ మందిరంలో కూర్చుంది. అధికారి భార్య నిజమే అనుకొని పూజలో పాల్గొన్నారు. కొద్ది సేపటికి అమ్మవారి ముందు డబ్బు పెట్టి వేడుకుంటే అంతా మంచి జరుగుతుందని చెప్పింది. దీంతో అధికారి భార్య ఇంట్లో ఉన్న లక్ష రూపాయలను పూజ గదిలో పెట్టింది. ఆమె కళ్లు మూసుకొని దేవుడిని ప్రార్థిస్తుండగా మహిళ లక్ష రూపాయలను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. కొద్ది సేపటి ఆమె కళ్లు తెరిచి చూడగా మహిళ, డబ్బు కనిపించలేదు. సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించకపోతే చంపేస్తా..

యువతిని బెదిరించిన యువకుడు.. కేసు నమోదు

యూసుఫ్‌గూడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో ఓ యువతి వెంట పడటంతోపాటు ప్రేమించకపోతే చంపేస్తా అంటూ బెదిరింపులకు పాల్పడిన ప్రబుద్ధుడిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే రహ్మత్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతికి 2022లో తన నివాసం సమీపంలో తన సోదరి ద్వారా అజయ్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. అతను ప్రేమిస్తున్నాని చెప్పటంతో ఆమె తిరస్కరించింది. దీంతో సాధారణ ఫ్రెండ్స్‌గా ఉందామంటూ ఫోన్‌లు చేస్తూ ఉండేవాడు. అప్పుడప్పుడూ ఆ యువతి వీధిలోకి వచ్చి ఫొటోలు సేకరించాడు. ఈనెల 6వ తేదీ ఫోన్ చేసి ప్రేమించాలని ఆ యువతిని మళ్లీ కోరాడు. మళ్లీ తిరస్కరించడంతో 'ప్రేమించకపోతే చంపేస్తా. నీ ఫొటోలు అందరికీ పంపుతా' అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దౌర్జన్యంగా కార్యాలయంలోకి వచ్చి దాడి

యూసుఫ్‌గూడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దౌర్జన్యంగా కార్యాలయంలోకి వచ్చి ఆఫీస్ ఫర్నిచర్ ధ్వంసం చేయటమే కాకుండా ఆపేందుకు ప్రయత్నించిన సిబ్బందిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలోని వాసవీ గ్రాండ్ వాసవీమాల్‌లో కలెక్షన్ కార్యాలయం ఉంది. మంగళవారం సాయంత్రం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బలవంతంగా కార్యాలయంలోకి వచ్చారు. 'సురేష్ ఉన్నాడా' అని అడిగారు. సిబ్బంది సమాధానం చెప్పేలోపే ఆఫీసు ఫర్నిచర్, డెస్క్‌టాప్‌ను ధ్వంసం చేశారు. సిబ్బంది రాడీ, శశిధర్ ఆపేందుకు ప్రయత్నిస్తే వారిపైనా దాడిచేశారు. ఇంతలో మరో ఉద్యోగి వచ్చి ఆపేందుకు చూసినా అతనిపై కూడా దాడిచేశారు. దీంతో 100కు ఫోన్ చేశారు. అనంతరం వారిపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం, దోపిడీ కేసులో నిందితుడి అరెస్ట్

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న అర్ధరాత్రి ఫిలింనగర్ బస్టాప్ వద్ద ఓ మహిళకు లిఫ్ట్ ఇచ్చి, ద్విచక్ర వాహనంపై నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేసి, సెల్‌ఫోన్, డబ్బులు దోపిడీ చేసిన కేసులో నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు సెల్‌ఫోన్‌సిగ్నల్ ద్వారా నిందితుడు ఫిలింనగర్ జ్ఞాని జైల్‌సింగ్‌నగర్‌కు చెందిన కిషోర్‌గా గుర్తించారు. అతడిని బుధవారం రిమాండ్ తరలించారు. నిందితుడి నుంచి సెల్‌ఫోను, నగదును స్వాధీనం చేసుకున్నారు.


రథంపై అమ్మవారు


బల్కంపేట ఎల్లమ్మ రథం ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు


ఊరేగింపులో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్


బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న ప్రొ.కోదండరాం

ఎల్లమ్మా.. సల్లంగ చూడమ్మా..

బల్కంపేట ఎల్లమ్మ రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. భక్తులు తరలొచ్చి.. ఊరేగింపులో పాల్గొన్నారు. ఎల్లమ్మ తల్లీ.. సల్లంగ చూడమ్మా.. అంటూ వేడుకున్నారు. ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రొ.కోదండరాం అమ్మవారికి పూజలు చేశారు. బల్కంపేట ఆలయాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి, బోనాల ఉత్సవాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ జగన్, ఏసీపీ వెంకటరమణ, దేవస్థానం ఈఓ అంజనాదేవి, తహసీల్దార్ భీమయ్యగౌడ్, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. -హైదరాబాద్ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి)


ఆలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

డెంగీపై సమష్టిగా పోరాడుదాం

పలు విభాగాల అధికారులతో జెడ్‌సీ సమావేశం



పలు విభాగాల అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

ఖైరతాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి):డెంగీ ప్రబలకుండా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్లాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్‌కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. బుధవారం ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఆయన జిల్లా మెడికల్ అధికారి, వారి బృందం, మలేరియా విభాగం అధికారులు, డిప్యూటీ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, వైద్యాధికారులు, సీనియర్, జూనియర్ ఎంటమాలజీ అధికారులతో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల, కళాశాలలో దోమలు వృద్ధి చెందేలా ఉన్న నీరు నిలిచే ప్రాంతాలను అరికట్టాలని, విద్యార్థులకు ఇళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలని కోరారు. ప్రతి బస్తీ, కాలనీలలో ఇంటింటికీ వెళ్లి దోమలు వృద్ధి చెందకుండా అవగాహన కల్పించాలని కోరారు. నాలాలు, చిన్న పాటి కొలనుల్లో చెత్తను, గుర్రపుడెక్కను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వీధుల్లో, కాలనీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు.

విద్యార్థులూ.. అవగాహన కల్పిద్దాం రండి..

డెంగీపై సమాజంలో చైతన్యం కల్పించేందుకు విద్యార్థులు తమతో భాగస్వాములు కావాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. ఈ వర్షాకాలంలో జీహెచ్‌ఎంసీ, వైద్యవిభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి డెంగీ, ఇతర వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమాజాన్ని జాగృతం చేయాలన్నారు. ఈ విషయంలో ఈ నెల 14 నుంచి 22 సంవత్సరాలలోపు విద్యార్థులు తమ పేర్లను జాయిన్ ద ఫైట్ ఎగెనెస్ట్ డెంగీ పేరిట తయారైన ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకోవచ్చునని, పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు.

తాజ్‌కృష్ణాలో సూత్ర ప్రదర్శన


ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న కర్ణాటక మిస్‌యూనివర్స్ డైరెక్టర్ ప్రాచీ నాగ్‌పాల్

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆధునిక.. సంప్రదాయ మేళవింపు కలగలిపిన సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ తాజ్‌కృష్ణాలో ఏర్పాటైంది. ఈ ప్రదర్శనను బుధవారం మిస్ గ్రాండ్ ఇండియా-2022ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర మిస్ యూనివర్స్ డైరెక్టర్ ప్రాచీనాగ్‌పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే అనేక నగరాల మహిళా వ్యాపారవేత్తలు, డిజైనర్లను ఒకే వేదికలోకి తెచ్చి, వేలాది రకాల ఉత్పత్తులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పండుగ సీజన్‌లో మహిళలకు షాపింగ్‌కోసం అన్నిచోట్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇలాంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయన్నారు. నిర్వాహకుడు ఉమేష్ మాట్లాడుతూ రాఖీ, తీజ్‌పండుగలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకమైన ఫ్యాషన్ ఉత్పత్తులు, సంప్రదాయ వస్త్రాలతోపాటుడిజైనర్, వెస్ట్రన్ వేర్, ఇండియన్‌అప్పారెల్, హ్యాండ్లూమ్స్, కాస్ట్యూమ్- డిజైనర్ జ్యువెలరీతో పాటు గృహోపకరణాలు, పాదరక్షలు తదితర ఉత్పత్తులను 70 స్టాళ్లలో అందుబాటులో ఉంచామన్నారు. ఈనెల 12 వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు.

గ్రూప్-2ను డిసెంబర్‌లో నిర్వహించాలి

సీఎం రేవంత్ రెడ్డి హామీని నెరవేర్చాలి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అభ్యర్థులు

పంజాగుట్ట, జూలై10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంతో కాలంగా నిరుద్యోగులు, విద్యార్థులు ఎదురుచూస్తున్న టీజీపీఎస్సీ నిర్వహించనున్న గ్రూప్-2, 3 పోస్టులను పెంచి, గ్రూప్-2ను డిసెంబర్‌లో నిర్వహించాలని తెలంగాణ నిరుద్యోగ యువత, గ్రూప్-2 అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అభ్యర్థులు గ్రూప్-2, 3 పోస్టులు పెంచి, గ్రూప్-2 పరీక్షను డిసెంబర్‌లో నిర్వహించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 సంవత్సరాలుగా గ్రూప్-1, 2, 3 ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్నామని, ప్రస్తుతం పబ్లిక్‌సర్వీస్ కమిషన్ ఇచ్చిన తేదీల వల్ల గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను, డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలలో ఏదో ఒకటి ఎంపిక చేసుకుని రాయాల్సి వస్తుందని అన్నారు. దీంతో లక్షలలో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-1, డీఎస్సీ మాదిరిగానే గ్రూప్-2, 3 నోటిఫికేషన్‌లలో పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఈ సమావేశంలో నిరుద్యోగులు, గ్రూప్-2 అభ్యర్థులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి 'అగ్రి' వర్సిటీలో

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- వసతిగృహం పై నుంచి దూకిన బీఎస్సీ స్టూడెంట్
- విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రగాయాలు

పేట్‌బషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు. పురుగుల మందు తాగి వసతి గృహం భవనం పై నుంచి కిందకు దూకాడు. విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన రామారావు కుమారుడు శెట్టిపెల్లి హరినాథ్(26) మేడ్చల్ జిల్లా మైసమ్మగూడలో మల్లారెడ్డి అగ్రికల్చరల్ యూనివర్సిటీలో మూడో సంవత్సరం బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చదువుతూ సాయిబాలాజీ వసతి గృహంలో ఉంటున్నాడు. మూడు రోజులుగా యూనివర్సిటీకి వెళ్లడం లేదు. మంగళవారం హైదరాబాద్‌లో ఉంటున్న అక్క వద్దకు వెళ్లివచ్చాడు. బుధవారం తోటి విద్యార్థులు కళాశాలకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో పురుగుల మందు తాగిన హరినాథ్ వసతిగృహం 5వ అంతస్తు పై నుంచి దూకాడు. పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వసతిగృహం నిర్వాహకులు తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. 108 సహాయంతో అతడిని కొంపల్లిలో శ్రీకర్ ఆస్పత్రికి తరలించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

- మంత్రి పొన్నంకు కార్పొరేటర్ సీఎన్.రెడ్డి వినతి

యూసుఫ్‌గూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్‌లోని ప్రధాన ప్రాంతాలైన కార్మికనగర్, ఎస్పీఆర్‌హిల్స్ ప్రాంతాల వాలుసులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కార్పొరేటర్ సీఎన్.రెడ్డి బుధవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ ప్రాంతం వాసులందరూ పేదలు కావటంతో ఆర్టీసీ బస్సుప్రయాణమే చేస్తారన్నారు. అయితే ఎక్కడకు వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు రహ్మత్‌నగర్ చౌరస్తా వరకు చాలా దూరం రావాల్సి వస్తోందని తెలిపారు. రహ్మత్‌నగర్ నుంచి బోరబండవైపు వెళ్లే బస్సులను కార్మికనగర్, ఎస్పీఆర్‌హిల్స్, శ్రీరామ్‌నగర్‌ల మీదుగా వెళ్లేలా చూడాలని, అదేవిధంగా బోరబండ నుంచి వెళ్లే బస్సులను శ్రీరామ్‌నగర్, ఎస్పీఆర్‌హిల్స్, కార్మికనగర్‌ల మీదుగా రహ్మత్‌నగర్ చౌరస్తాకు అనుసంధానం చేయాలన్నారు. దీంతో ఈ ప్రాంతాల్లో ఉన్న అన్ని బస్తీలప్రజలకు ఆర్టీసీ ప్రయాణం సులభతరం అవుతుందని మంత్రికి వివరించారు.

లేబర్ అడ్డాల వద్ద మరుగుదొడ్లను నిర్మించాలి

బోరబండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని అన్ని కార్మికుల అడ్డాలపై మూత్రశాలలు, మరుగుదొడ్లలను నిర్మించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ)ప్రజాసంఘాల నాయకులు టీ.సాయి శేషగిరిరావు అన్నారు. బుధవారం భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సంఘం రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆయన కార్మికులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలు, సోమేష్, మహమూద్, యాదగిరి, లక్ష్మమ్మ, సావిత్రి, మణెమ్మ పాల్గొన్నారు.

బీసీ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ

బంజారాహిల్స్, జూలై 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గా జూబ్లీహిల్స్ నియోజకవర్గంకు చెందిన కె.సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ అధ్యక్షుడు గువ్వల భరత్‌కుమార్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

చెన్నూరు ఎమ్మెల్యే వీవీఎస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

పంజాగుట్ట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన రాష్ట్ర ఏర్పాటులో ముఖ్యభూమిక పోషించిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి(వీవీఎస్)కి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య కోరారు. బుధవారం బంజారాహిల్స్‌రోడ్ నెంబర్-1లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్లు గోపోజు రమేష్, మన్నె శ్రీధర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడుతూ వివేక్‌కు మంత్రి పదవి ఇస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్, భాను ప్రకాష్, మాలమహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, గోకుల్ కల్యాణ్, డా.కుమార్, ఎల్లస్వామి, గణేష్, అనిల్, శ్రీరామ్, గిరి, జగన్ పాల్గొన్నారు.

- డా.ఎస్ఎం హుసేని ముజీబ్‌కు సన్మానం



టీఎన్జీయూనియన్ కేంద్రసంఘ ప్రధానకార్యదర్శి డా.ఎస్ఎంహుసేని ముజీబ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన్ను కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో నేతలు జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కే.విక్రమ్‌కుమార్, సభ్యులు కేఆర్ రాజ్‌కుమార్, బాల్‌రాజ్, ఉమర్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్‌కుమార్, ఖలీద్ అహ్మద్ పాల్గొన్నారు.
- (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

విద్యుత్ తనిఖీశాఖ సీఈఐజీగా (రూరల్) రామాంజనేయులు

హైదరాబాద్‌సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఎనర్జీ డిపార్ట్‌మెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ (రూరల్) చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్(సీఈఐజీ)గా రామాంజనేయులుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంధనశాఖ ప్రధాన కార్యదర్శి రోనాల్డ్‌రోస్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గోల్డెన్ జూబ్లీ.. ముహూర్తం ఫిక్స్!

- జేఎన్‌టీయూలో రూ.36 కోట్లతో భవన నిర్మాణం
- 13న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లపై వర్సిటీ డైరెక్టర్లతో ఇన్‌చార్జి వీసీ సమీక్ష



జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం

హైదరాబాద్ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో రూ.36 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబిలీ భవనం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 13న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన భవనాన్ని ప్రారంభిస్తారని జేఎన్‌టీయూ డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రారంభోత్సవం ఏర్పాట్ల పర్యవేక్షణకు అవసరమైన కమిటీలను ఏర్పాటు చేయాలని రిజిస్ట్రార్‌కు సూచించినట్లు తెలిపారు. గోల్డెన్ జూబ్లీ భవనం ప్రారంభోత్సవం తర్వాత జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్య ప్రతినిధులతో, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం వేర్వేరుగా సమావేశం అవుతారన్నారు. సీఎం పాల్గొనే కార్యక్రమాలన్నీ విజయవంతం అయ్యేలా పని చేయాలని వివిధ విభాగాల డైరెక్టర్లను, డిప్యూటీ డైరెక్టర్లను వీసీ ఆదేశించారు.

కోర్ బ్రాంచ్‌లు లేకుంటే కష్టాలే..

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ ఒక్కటే కాదని కోర్ బ్రాంచ్‌లు లేకుంటే భవిష్యత్‌లో ఎన్నో కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం అన్నారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో కోర్ బ్రాంచ్‌లను మూసేయడం వలన భవిష్యత్‌లో భవన నిర్మాణం, ఆటోమొబైల్ రంగాల్లో పని చేసేందుకు సివిల్, మెకానికల్ ఇంజనీర్ల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. కోర్ బ్రాంచ్‌ల కొనసాగించేందుకు వీలుగా ఇంజనీరింగ్ కాలేజీలకు, విద్యార్థులకు ఆమోదయోగ్యంగా ఉండేలా సీఎం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. సీఎంతో జరిగే సమావేశానికి జేఎన్‌టీయూ పరిధిలోని 214 ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలల నుంచి కళాశాలకు ఐదుగురు చొప్పున (ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీ, ప్రొఫెసర్లు) హాజర య్యేలా చూడాలని రిజిస్ట్రార్‌కు సూచించారు.

మరింత మెరుగ్గా ఎన్ఎస్ఎస్

విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని భావిస్తున్నట్లు వీసీ చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ అవేర్‌నెస్ కల్పించి నగరంలోని పలు కూడళ్లలో సేవలందించేందుకు వలంటీర్లను నియమించాలని వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త శోభారాణికి సూచించారు. అలాగే, నగరంలోని వివిధ కాలనీలు, బస్తీల్లో చిన్నారులు లైంగిక వేధింపులకు గురికాకుండా వారికి తగు సూచనలు చేసే బాధ్యతను కూడా ఎన్ఎస్ఎస్ మహిళా వలంటీర్లకు అప్పగించాలన్నారు. షాపింగ్ మాల్స్, ఇతర వస్త్ర దుకాణాల్లో స్పై కెమెరాలను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడం, స్పై కెమెరాలు లేని దుకాణాలకు 'నో కెమెరా జోన్' గా పేర్కొంటూ స్టిక్కర్లు అతికించడం వలన మహిళలకు కొంత మేరకు భద్రత కల్పించినట్లవుతుందన్నారు. సమావేశంలో రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, ఉన్నత విద్యామండలి అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో డీసీ అమోహ్, కార్పొరేటర్ సునీత తదితరులు

అంటువ్యాధులపై విద్యార్థులకు అవగాహన

చిలకలగూడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ, ఓంసాయి పాఠశాలలో బుధవారం విద్యార్థులకి అంటువ్యాధులపై జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త చేరకుండా చర్యలు చేపట్టాలని, కుండీలు, కూలర్లలో నీరు ఎప్పటికప్పుడు తీసివేయాలని, నగరంలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు పెరిగిపోతున్నాయని, అప్రమత్తంగా వుండాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అమోహ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, ఏఈ సునీత, ఎంటమాలాజి సిబ్బంది పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

తలసాని శంకర్‌యాదవ్ యాదిలో అన్నదానం

రెజిమెంటల్‌బజార్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మోండా మార్కెట్ వర్తకుల, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన మోండా మార్కెట్ అధ్యక్షుడు తలసాని శంకర్‌యాదవ్ మన మధ్య లేకపోవడం బాధాకరం అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం దివంగత శంకర్‌యాదవ్ జ్ఞాపకార్థం మోండా మార్కెట్‌లో ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శంకర్‌యాదవ్ చిత్రపటానికి నివాళులు అర్పించి, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌యాదవ్ సోదరులు మహేష్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, స్కైలాబ్ యాదవ్, కుమారుడు శివలాల్ యాదవ్, నాగులు, ఆకుల హరికృష్ణ, మధు, అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.


సీఐని సత్కరిస్తున్న శాస్త్రినగర్‌వాసులు

శాస్త్రినగర్‌లో నైట్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయండి

అడ్డగుట్ట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శాస్త్రినగర్‌లో రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ శాస్త్రినగర్‌వాసులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాలోత్ శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, యువత వ్యసనాలబారిన పడుతున్నారని, అదేవిధంగా శాస్త్రినగర్ బస్తీలో ప్రతి రోజూ రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సీఐని కలిసినవారిలో మల్లేష్, శ్రీశైలం, బిక్షపతి, కుమార్, సుజాత, గణేష్, రవి, ఖాజా, రాజు ఉన్నారు. అదేవిధంగా లంబాడి బస్తీకి చెందిన శ్రీరామ్‌నాయక్ ఆధ్వర్యంలో సీఐని కలిశారు.

బొల్లారంలో అక్రమ నిర్మాణం కూల్చివేత


తిరుమలగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని గోపాలస్వామి దేవాలయం సమీపంలో బీ3 స్థలంలో అనుమతి లేకుండా నిర్మించిన గదిని కంటోన్మెంట్ బోర్డు ఇంజనీరింగ్ విభాగం అధికారులు బుధవారం కూల్చివేశారు. కబ్జాదారులు కంటోన్మెంట్‌కు చెందిన స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. బీ3 స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే పౌరులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కూల్చివేతల్లో చీఫ్ ఇంజనీర్ ఉమాశంకర్, క్రిష్ణకాంత్‌రెడ్డి, తరుణ్, శివాజి, దినేష్, ఆదిత్య నారాయణ, ఆశిష్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమిత్ ఉన్నారు.


అక్రమంగా నిర్మించిన గదిని కూల్చివేస్తున్న అధికారులు

దేశవ్యాప్తంగా నిరసనలకు సిద్ధం

- సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి అజయ్ బాబు

అడ్డగుట్ట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఎం.అజయ్‌బాబు అన్నారు. సికింద్రాబాద్ అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ గత పదేళ్లుగా సాగించిన సంస్కరణలు, ప్రైవేటీకరణల విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు మళ్లీ ఉవ్విళ్లూరుతుందన్నారు. బొగ్గు బ్లాక్‌ల వేలానికి కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యజమాన్యాలు జరిమానాను భారీగా తగ్గించిందన్నారు. కార్మిక హక్కులను కాపాడుకునేందుకు దేశవ్యాపితంగా నిరసన పోరాటాలను ఉధృతం చేయాలని సీఐటీయు అఖిలభారత కమిటీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయు కమిటీ సభ్యుడు నర్సింగ్, శంకర్‌యాదవ్, రాంచందర్, అశోక్, సిద్దయ్య, రాంచంద్రనాయక్, తాలయ్య, వెంకటేష్, కృష్ణ మోహన్, సైదమ్మలు పాల్గొన్నారు.


రథంపై అమ్మవారు


బల్కంపేట ఎల్లమ్మ రథం ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

ఎల్లమ్మా.. సల్లంగ చూడమ్మా..


ఆలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బల్కంపేట ఎల్లమ్మ రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. భక్తులు తరలొచ్చి.. ఊరేగింపులో పాల్గొన్నారు. ఎల్లమ్మ తల్లీ.. సల్లంగ చూడమ్మా.. అంటూ వేడుకున్నారు. ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రొ.కోదండరాం అమ్మవారికి పూజలు చేశారు. బల్కంపేట ఆలయాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి, బోనాల ఉత్సవాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జగన్, ఏసీపీ వెంకటరమణ, దేవస్థానం ఈఓ అంజనా దేవి, తహసీల్దార్ భీమయ్యగౌడ్, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఎల్లమ్మ ఆలయంలో వేదపండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న ప్రొ.కోదండరాం

-హైదరాబాద్ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి)

త్వరలో అందుబాటులోకి టిమ్స్ ఆస్పత్రి

- ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఎంతో కృషిచేస్తున్నారని, అందులో భాగంగా బొల్లారంలో టిమ్స్ ఆస్పత్రిని నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. గాంధీ ఆస్పత్రికి వెళ్లకుండా సిద్దిపేట, మెదక్, మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే రోగులు టిమ్స్ ఆస్పత్రిలో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, దీంతోపాటు కంటోన్మెంట్ ప్రజలకు కూడా వైద్యసేవలు అందుతాయని అన్నారు. వీలైనంత త్వరగా ఆస్పత్రి నిర్మాణంలో ఎక్కడా చిన్నపాటి లోపం లేకుండా పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నిర్మాణం అవుతున్న ఆస్పత్రిని పూర్తిగా కలియతిరిగారు. ఏ బ్లాక్ ఎక్కడ ఉంది, ఎన్ని బ్లాక్‌లు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్య వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా నిర్మిస్తున్నామన్నారు. వైద్య సదుపాయాలు కూడా అదే తరహాలో ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం 1000 నుంచి 1200 పడకల వరకు నిర్మాణం కొనసాగుతుందని, ప్రజలకు మరింత సదుపాయంగా ఉండేవిధంగా 1400 పడకలకు పెంచే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు అయ్యేవిధంగా కృషి చేస్తామన్నారు. వచ్చే సంవత్సరం సెప్టెంబర్ కల్లా ఆస్పత్రిని పూర్తిగా నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ అధికారులు విశ్వకుమార్, విజయ్, శేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోయినపల్లి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేజె.నరసింహన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్, జీవీ.బాల్‌రాజ్, రషీద్, నాగనేని సరిత తదితరులు ఉన్నారు.


టిమ్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ప్రజాపాలన దరఖాస్తుల రీ ఎంట్రీ షురూ

అడ్డగుట్ట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఆరు గ్యారంటీల పథకంపై ఎవరూ అపోహలకు గురికావద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంట రాజుసాగర్ అన్నారు. బుధవారం తుకారాంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్‌లో ఉన్న తుకారాంగేట్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ అధికారులు ప్రజాపాలన రీ ఎంట్రీ ప్రారంభించిన సేవల్ని అడ్డగుట్ట కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా తుకారాంగేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రాజుసాగర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా లబ్ధిదారులకు రాలేదని ఎవ్వరూ అధైర్యపడవద్దని, మొదటి రోజు వార్డు కార్యాలయంలో రీ ఎంట్రీ సేవలు ప్రారంభించారన్నారు. గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న విద్యుత్ గ్యాస్ సబ్సిడీ పింఛన్, ఇతర పథకాలపై దరఖాస్తు చేసుకున్నవారికి రాకపోతే మళ్లీ రీ ఎంట్రీ చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు దరఖాస్తు చేసుకున్న మీ వివరాలు ఉన్నాయని, దరఖాస్తు చేసుకుని రానివాళ్ల కోసం ఇక్కడ రీ ఎంట్రీ సేవల్ని ప్రారంభించామన్నారు. బాధిత లబ్ధిదారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రీ ఎంట్రీ చేసుకునే వీలుగా లబ్ధిదారులకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఇక ఆదివారం మినహా ప్రతి రోజు సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలపై ఎవ్వరు కూడా అపోహలకు గురికావద్దని సీఎం రేవంత్ రెడ్డి ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి అని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. సేవల్ని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంద ప్రభాకర్, కొమురమ్మ, కృష్ణ, లక్ష్మీయాదవ్, రమేష్ పాల్గొన్నారు.


తుకారాంగేట్ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను నమోదు చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

మల్లారెడ్డి 'అగ్రి' వర్సిటీలో
విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- వసతిగృహం పై నుంచి దూకిన బీఎస్సీ స్టూడెంట్
- విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రగాయాలు

పేట్‌బషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు. పురుగుల మందు తాగి వసతి గృహం భవనం పై నుంచి కిందకు దూకాడు. విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన రామారావు కుమారుడు శెట్టిపెల్లి హరినాథ్(26) మేడ్చల్ జిల్లా మైసమ్మగూడలో మల్లారెడ్డి అగ్రికల్చరల్ యూనివర్సిటీలో మూడో సంవత్సరం బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చదువుతూ సాయిబాలాజీ వసతి గృహంలో ఉంటున్నాడు. మూడు రోజులుగా యూనివర్సిటీకి వెళ్లడం లేదు. మంగళవారం హైదరాబాద్‌లో ఉంటున్న అక్క వద్దకు వెళ్లివచ్చాడు. బుధవారం తోటి విద్యార్థులు కళాశాలకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో పురుగుల మందు తాగిన హరినాథ్ వసతిగృహం 5వ అంతస్తు పై నుంచి దూకాడు. పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వసతిగృహం నిర్వాహకులు తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. 108 సహాయంతో అతడిని కొంపల్లిలో శ్రీకర్ ఆస్పత్రికి తరలించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


భవనం పై నుంచి పడి తీవ్రంగా గాయపడిన హరినాథ్


గాంధీ ఆస్పత్రిలో డ్రైనేజీ సివరేజ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు

గాంధీలో డ్రైనేజీ పనులకు శ్రీకారం

అడ్డగుట్ట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సివరేజ్ పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. గాంధీ ఆస్పత్రిలో డ్రైనేజీ సివరేజ్ పనులకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.15.5కోట్ల నిధులతో బుధవారం గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు చేతుల మీదుగా పనులకు ప్రారంభోత్సవం చేశారు. వెంటనే పనులు చేపట్టేందుకు శ్రీకారంచుడుతున్నామని సూపరింటెండెంట్ తెలిపారు.

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగల పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సెల్‌ఫోన్‌లను దొంగిలిస్తున్న ఇద్దరు దొంగలను పట్టుకున్నామని బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం మధ్యరాత్రి ఆర్పీఎఫ్ శక్తి నాగమ్మ, రుద్రమ్మ టీం మహిళా కానిస్టేబుళ్ల తనిఖీలు చేస్తుండగా, అనుమానాస్పదస్థితిలో తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని జేబులో సెల్‌ఫోన్ దొరకడంతో ఆ వ్యక్తిని విచారించగా ప్రయాణికుడి నుంచి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఆ సమయంలో మరో వ్యక్తి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరినీ సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. రెండు ఫోన్ల ఖరీదు రూ.45వేలు ఉంటుందని ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం


సత్యమ్మ

బోయిన్‌పల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి ఆర్ఆర్ నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయిన్‌పల్లిలో తన కుమారుడు శ్రీకాంత్‌తో కలిసి నివాసం ఉంటున్న సత్యమ్మ (54) మూడురోజుల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే మూడురోజులు గడుస్తున్నా ఇంటికి తిరిగి రాలేదు. ఇరుగుపొరుగు వారిని, బంధువులను ఆరాతీసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో అనుమానం వచ్చిన కుమారుడు శ్రీకాంత్ బుధవారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్, రిమాండ్

బోయిన్‌పల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓ మైనర్ బాలిక (17)తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన భార్యాభర్తలు గత కొంతకాలంగా బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ దిల్కుష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. బాలిక ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసి ఇంటికి తిరిగివచ్చింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10గంటలకు ఇంటిదగ్గర నివాసం ఉండే నరేందర్ (25) బాలిక ఇంట్లో ఎవరూలేని సమయంలో చొరబడి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె అతని నుంచి తప్పించుకుని పక్కనే ఉన్న బంధువుల ఇంట్లోకి వెళ్లి జరిగిన విషయం చెప్పింది. దీంతో నరేందర్‌ను స్థానికుల సహాయంతో నిలదీస్తుండగా అతను పారిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం నిందితుడు నరేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గోల్డెన్ జూబ్లీ.. ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్!

- జేఎన్‌టీయూలో రూ.36కోట్లతో భవన నిర్మాణం
- 13న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లపై వర్సిటీ డైరెక్టర్లతో ఇన్‌చార్జి వీసీ సమీక్ష

హైదరాబాద్ సిటీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో రూ.36 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబిలీ భవనం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 13న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన భవనాన్ని ప్రారంభిస్తారని జేఎన్‌టీయూ డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం బుధవారం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రారంభోత్సవం ఏర్పాట్ల పర్యవేక్షణకు అవసరమైన కమిటీలను ఏర్పాటుచేయాలని రిజిస్ట్రార్‌కు సూచించినట్లు తెలిపారు. గోల్డెన్ జూబ్లీ భవనం ప్రారంభోత్సవం తర్వాత జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్య ప్రతినిధులతో, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం వేర్వేరుగా సమావేశం అవుతారన్నారు. సీఎం పాల్గొనే కార్యక్రమాలన్నీ విజయవంతం అయ్యేలా పనిచేయాలని వివిధ విభాగాల డైరెక్టర్లను, డిప్యూటీ డైరెక్టర్లను వీసీ ఆదేశించారు.

● కోర్ బ్రాంచ్‌లు లేకుంటే కష్టాలే..

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ ఒక్కటే కాదని, కోర్ బ్రాంచ్‌లు లేకుంటే భవిష్యత్‌లో ఎన్నో కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం అన్నారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో కోర్ బ్రాంచ్‌లను మూసేయడం వలన భవిష్యత్‌లో భవన నిర్మాణం, ఆటోమొబైల్ రంగాల్లో పనిచేసేందుకు సివిల్, మెకానికల్ ఇంజనీర్ల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. కోర్ బ్రాంచ్‌లను కొనసాగించేందుకు వీలుగా ఇంజనీరింగ్ కాలేజీలకు, విద్యార్థులకు ఆమోదయోగ్యంగా ఉండేలా సీఎం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. సీఎంతో జరిగే సమావేశానికి జేఎన్‌టీయూ పరిధిలోని 214 ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలల నుంచి కళాశాలకు ఐదుగురు చొప్పున (ప్రిన్సిపాల్, హెచ్ఓడీ, ప్రొఫెసర్లు) హాజరయ్యేలా చూడాలని రిజిస్ట్రార్‌కు సూచించారు.

● మరింత మెరుగ్గా ఎన్ఎస్ఎస్

విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని భావిస్తున్నట్లు వీసీ చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ అవేర్‌నెస్ కల్పించి నగరంలోని పలు కూడళ్లలో సేవలందించేందుకు వలంటీర్లను నియమించాలని వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త శోభారాణికి సూచించారు. అలాగే, నగరంలోని వివిధ కాలనీలు, బస్తీల్లో చిన్నారులు లైంగిక వేధింపులకు గురికాకుండా వారికి తగు సూచనలు చేసే బాధ్యతను కూడా ఎన్ఎస్ఎస్ మహిళా వలంటీర్లకు అప్పగించాలన్నారు. షాపింగ్ మాల్స్, ఇతర వస్త్ర దుకాణాల్లో స్పై కెమెరాలను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడం, స్పై కెమెరాలు లేని దుకాణాలకు 'నో కెమెరా జోన్'గా పేర్కొంటూ స్టిక్కర్లు అతికించడం వలన మహిళలకు కొంత మేరకు భద్రత కల్పించినట్లవుతుందన్నారు. సమావేశంలో రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, ఉన్నత విద్యామండలి అధికారులు పాల్గొన్నారు.

ఫ్రంట్‌లైన్ రైల్వే సిబ్బంది విశ్రాంతికి
ఆధునిక వసతులు

- సికింద్రాబాద్ స్టేషన్‌లో 28 గదులను అభివృద్ధి చేసిన దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైళ్లను సురక్షితంగా నడపడంలో కీలకపాత్ర పోషిస్తున్న లోకో పైలట్, అసిస్టెంట్ లోకోపైలెట్‌లు, ట్రైన్ మేనేజర్‌లు తదితర ఫ్రంట్ లైన్ సిబ్బంది కోసం దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ స్టేషన్‌లో సర్వహంగులతో క్రూ-బుకింగ్ లాబీ-రన్నింగ్ రూంలను అభివృద్ధి చేసింది. వివిధ ప్రాంతాలకు సమయపాలన పాటిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ముఖ్యభూమిక పోషిస్తున్న లోకో పైలట్‌లు, వారి సహాయకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విశ్రాంతి పొందడానికి రైల్వే అధికారులు రన్నింగ్ రూంలను తీర్చిదిద్దారు. సుదూర ప్రాంతాల నుంచి గంటలతరబడి రైళ్లను నడుపుకుంటూ వచ్చిన లోకో పైలట్‌లకు ఆయా ప్రధాన స్టేషన్‌లలో అవసరమైనంత సేపు విశ్రాంతి పొందడానికి తగిన వసతి సౌకర్యాలతో రన్నింగ్ రూంలను ఆధునీకరించారు. బుధవారం దక్షిణ మధ్య రైల్వే అధికారుల బృందం లోకోపైలట్‌ల కోసం సర్వహంగులతో అభివృద్ధి చేసిన రన్నింగ్‌లను మీడియా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి సుమారు రెండు వందలకు పైగా లోకోపైలట్‌లు విధి నిర్వహణలో సికింద్రాబాద్ స్టేషన్ చేరుకుని విశ్రాంతి తీసుకుని తిరిగి విధులకు హాజరవుతున్నారు. అంతే కాకుండా మరో అయిదు వందలకు పైగా లోకో పైలట్‌లు, వారి సహాయకులు సికింద్రాబాద్ స్టేషన్‌లో రిపోర్టు చేసి ఆయా రైళ్లలో విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు 8గంటలపాటు రైలు నడిపిన లోకో పైలట్‌లో మరో ఎనిమిది గంటలపాటు విశ్రాంతి తీసుకుని తిరిగి విధులకు హాజరు కావలిసి ఉంటుంది. అయితే ఆయా దూరప్రాంతాల నుంచి రైలునడుపుకుంటూ వచ్చిన లోకోపైలట్‌లకు అవసరమైన సౌకర్యాలతో స్టేషన్‌లో 28 గదులను రన్నింగ్‌రూంలుగా ఆధునికరించారు ఇందులో 60మంది ప్రశాంతంగా విశ్రాంతి పొందడానికి అనువుగా ఏర్పాట్లున్నాయి. పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్ (అల్పాహారం)రాత్రి పగలు భోజనం అందిస్తున్నారు. ఇక నామమాత్రపుచార్జీలతో లాంజ్/రీడింగ్ రూమ్, ధ్యానం కోసం యోగా గదిని ఏర్పాటుచేశారు. అలాగే అన్ని అంతస్తులకు లిఫ్ట్, లాండ్రీ సౌకర్యాలు, షూ షైనింగ్ మెషిన్, క్లీన్ వాష్‌రూమ్‌లు, సోలార్ వాటర్ హీటర్లు, డిజిటల్ బెడ్ ఆక్యుపెన్సీ సిస్టమ్‌తో రిసెప్షన్, మెకనైజ్డ్ వాష్ లినెన్, మంచాలు, బెడ్ షీట్లు అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. డైనింగ్ హాల్, మాడ్యులర్ కిచెన్ మరియు స్టోర్, మంచినీటి సరఫరా వంటి ఇతర సౌకర్యాలు కల్పించినట్లు సికింద్రాబాద్ రైల్వే అదనపు డివిజనల్ మేనేజర్ ఎం.గోపాల్ వివరించారు. ప్రతి రోజూ సుమారు 800 మంది ఇక్కడి నుంచి సైన్‌ఆన్, సైన్ ఆఫ్ చేస్తారని ఆయన తెలిపారు. విధుల్లో చేరేముందుగా లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్స్‌ను పరీక్షించేందుకు లాబీలో ఇంటిగ్రేటెడ్ కియోస్కులు (బ్రీత్ ఎనలైజర్, బయో-మెట్రిక్‌వెబ్ క్యామ్)లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. లోకో పైలట్‌లు బ్రీత్ అనలైజింగ్ టెస్ట్ తర్వాత'నోసిగ్నల్ పాసింగ్ ఎట్ డేంజర్ పైప్రమాణం చేయాల్సి ఉంటుందన్నారు. సికింద్రాబాద్‌స్టేషన్ నుంచి విజయవాడ, గుంటూరు, గుంతకల్, బల ర్షా, షోలాపూర్, పర్లి తదితర ప్రాంతాలకు రైళ్లను నడిపే లోకోపైలెట్స్, వారి సహాయకులు ఇక్కడే సైన్‌ఆన్, సైన్ ఆఫ్ చేస్తారని పేర్కొన్నారు.



రైల్వే లోకోపైలట్ క్రూబుకింగ్ లాబీ రన్నింగ్ గదిని పరిశీలిస్తున్న రైల్వే ఏడీఆర్ఎం ఎం.గోపాల్